క్లుప్తంగా

గర్భిణులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

టేకులపల్లి: మారుమూల గ్రామాలలోని గర్భిణుల పట్ల ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ వైద్య సిబ్బందిని, ఆశా కార్యకర్తలని ఆదేశించారు. గురువారం బీల్యాతండా, రుక్మాతండ, రోళ్లపాడు గ్రామాలను సందర్శించి గర్భిణులతో మాట్లాడారు. ముందు జాగ్రత్తగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రామవరంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో అడ్మిట్ అవ్వాలని సూచించారు. ఇక్కడ గర్భిణికి తనతో వచ్చిన సహాయకురాలికి వసతి, భోజన సౌకర్యం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, సూపర్‌వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి



కలాంకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన మహానుబావుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అని గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చింతల చెర్వు గెర్షోము అన్నారు. గురువారం అబ్దుల్‌కలాం వర్ధంతిని సీఎస్ఐ చర్చి హాస్టల్‌లో నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గెర్షోము మాట్లాడుతూ.. అబ్దుల్‌కలాం పద్మశ్రీ, పద్మ విభూషణ్, భారతరత్న వంటి అవార్డులు పొందడం అందరూ గర్వించాల్సిన విషయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సోనూసూద్, సత్తార్, జ్ఞానవినోదిని తదితరులు పాల్గొన్నారు.

డీర్‌పార్కులోకి ప్రవేశాలు నిలిపివేత



కిన్నెరసాని ప్రధాన గేటు ఎదుట నిరీక్షిస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యాన సందర్శకుల ప్రవేశాలను అధికారులు గురువారం నిలిపివేశారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రాజెక్టు, డీర్‌పార్కును సందర్శించేందుకు వచ్చిన వారు నిరాశగా వెనుదిరిగారు. కాగా, మరికొందరు మాత్రం మరో మార్గంలో డ్యామ్ పైకి వెళ్లి కిన్నెరసాని వరదను వీక్షించారు.

సమ్మె విరమించిన సోలార్ కార్మికులు

ఇల్లెందు: సింగరేణి సోలార్ ప్లాంట్ కార్మికులు రెండోరోజు గురువారం సమ్మె సాగించారు. ఈ క్రమంలో సింగరేణి ఏజీఎం ప్రభాకర్, శేఖర్, వీరు నాయక్‌ల బృందం కార్మిక సంఘాల నేతలో చర్చలు జరిపారు. కార్మికులు చేస్తున్న సమ్మెను విరమింపచేసేలా తక్షణం వారి డిమాండ్లు పరిష్కరించాలని కాంట్రాక్టర్‌ను సింగరేణి అధికారులు ఆదేశించారు. ఆగస్టు 20 లోపు వేతన పెంపుదల ఉంటుందని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మెను విరమించారు. ఈ సమ్మెలో ఇఫ్టూ, సీఐటీయూ నేతలు యాకుబ్‌షావలీ, ఎస్ఐ నబీ, సర్పంచ్ బన్సీలాల్, కార్మికులు పాల్గొన్నారు.

పెన్షన్ అదాలత్‌లో సమస్యలు పరిష్కారం



అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా మాజీ ఉద్యోగుల పెన్షన్, సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం గురువారం ఇల్లెందులోని ఆఫీసర్స్ క్లబ్‌లో పెన్షన్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం జాన్ ఆనంద్, అసిస్టెంట్ కమిషనర్ సీఎంపీఎఫ్ కొత్తగూడెం ఎం.కనకమ్మ హాజరు కాగా పలువురు మాజీ ఉద్యోగులు హాజరై తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కనకమ్మ మాట్లాడుతూ.. ప్రతీ నాలుగు నెలలకోసారి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తామని, మాజీ ఉద్యోగులు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, రక్షణ అధికారి పంజాల శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ఫైనాన్స్ అధికారి చిన్ని ప్రసాద్, ఇతర అధికారులు, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు ఎస్.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బీభత్సం..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గురువారం లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లలో వరద నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు పర్యటించి, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో పూరిళ్లు కూలిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు పత్తి పంటలు నీటమునగగా, మిరపనారు దెబ్బతిన్నది. వరినాట్లు కొట్టుకపోయాయి. చెరువులు, కుంటల్లోకి వరదనీరు భారీగా చేరడంతో నిండుకుండను తలపిస్తున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: పడమటనర్సాపురం తుమ్మలవాగు లోలెవల్ బ్రిడ్జి



ఇల్లెందు: లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజ్



ఇల్లెందురూరల్: కట్టుగూడెం రోడ్డులో కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ శిరీష, తహసీల్దార్ కృష్ణవేణి



రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న పోలారం పెద్ద చెరువు అలుగు వరద



చల్లసముద్రం పెద్ద చెరువు అలుగు వరద



టేకులపల్లి: ముర్పుట్ల (పారికలవాగు) అలుగు పోస్తున్న దృశ్యం



రాంపురం కల్వర్టు వద్ద రాకపోకలు నిలిపివేసిన పోలీసులు, పంచాయతీ అధికారులు



సుజాతనగర్: సింగభూపాలెం చెరువు అలుగు



చుంచుపల్లి: ట్రాక్టర్ అడ్డుగా పెట్టి పెనుబల్లి వాగుపై రాకపోకలు నిలిపివేసిన స్థానికులు



జూలూరుపాడు: మాచినేనిపేట - వాగొడ్డుతండా మధ్య ఎదళ్ల వాగుపై లోలెవల్ బ్రిడ్జి



వాగును పరిశీలిస్తున్న జూలూరుపాడు తహసీల్దార్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు



పాల్వంచరూరల్: రంగాపురం వద్ద మునిగిన పంటపొలాలు



ఇల్లెందు - మహబూబాబాద్ రోడ్డు లో రాకపోకలను నిలిపివేసిన ఒడ్డుగూడెం పంచాయతీ పాలకవర్గం



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో నేలకూలిన ఇంటి ప్రహరీ



ఇల్లెందు: సత్యనారాయణపురంలో కూలిపోయిన పెంకుటిల్లు



సుజాతనగర్: రాంజీతండాలో పాఠశాలలోకి చేరిన వరద నీరు



టేకులపల్లి: కొప్పురాయి వద్ద రాకపోకలు నిలిపివేసిన బోడు ఎస్ఐ, పంచాయతీ అధికారులు

సహాయక చర్యలను పర్యవేక్షించిన డీపీఓ



అర్ధరాత్రి వరద ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న డీపీఓ రమాకాంత్

చుంచుపల్లి: బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కొత్తగూడెం– విద్యానగర్ ప్రధాన రహదారి పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయింది. చింతల చెరువు అలుగు నుంచి నీరు భారీ ఎత్తున రహదారిపైకి చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు, పంచాయతీ సిబ్బంది అర్ధరాత్రి తక్షణ చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న డీపీఓ రమాకాంత్ అక్కడి చేరుకుని సహాయక చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్

పాల్వంచ: పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ అజ్మీర స్వామి గురువారం పర్యటించారు. కేసీఆర్ నగర్, నవభారత్‌ఏరియా, శివనగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి వరద నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బురదమయంగా మారిన రోడ్లను పరిశీలించారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి కచ్చా కాల్వలు తీసి నీళ్లు వెళ్లిపోయేలా చర్యలు చేపట్టాలని డీఈ మురళీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావులను ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది ఏఈ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా నుంచి కార్పొరేట్‌కు జనరల్ మేనేజర్ (అండర్ గ్రౌండ్ మైన్స్)గా బదిలీపై వెళ్తున్న వై.రఘురామిరెడ్డిని ఏరియా స్టోర్ అధికారులు, ఉద్యోగులు, కార్మిక ప్రతినిధులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా స్టోర్ ఇన్‌చార్జ్ కేవీఆర్ ప్రకాష్, కొత్తగూడెం ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, పిట్ సెక్రటరీ నటరాజ్, ఏరియా స్టోర్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు ఎరువులు



మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ

జూలూరుపాడు: రైతులకు సబ్సిడీపై ఎరువులు అందిస్తున్న ఘనత ప్రధాని నరేంద్ర మోదీదేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) అన్నారు. గురువారం గుండెపుడి ఆర్కే ఫంక్షన్ హాల్‌లో కోరమండల్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రధాని ప్రారంభించిన కిసాన్ సమృద్ధి యోజన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులకు స్క్రీన్‌పై చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మోదీ ప్రారంభించిన ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన పథకం ద్వారా ఎరువుల రిటైల్ దుకాణాలు ప్రధాని కిసాన్ సేవా కేంద్రాలుగా పని చేస్తాయన్నారు. ఈ కేంద్రాల్లో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో చిలుకూరి రమేష్, కోనేరు నాగేశ్వరరావు, మాదినేని సతీష్, భూక్యా శ్రీను, సిరిపురపు ప్రసాద్, భూక్యా రాజేష్, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు వాసు గంగాధర్, భద్రం, డీలర్లు ఆళ్ల మధుబాబు, మంగముడి నాగేశ్వరరావు, ఎండపల్లి సీతారాములు, అడపా సురేష్, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పాపకొల్లులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం పాపకొల్లు గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇంటి లోపల, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీ రాధిక, ఏఎన్ఎంలు తార, పార్వతి, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

జూలూరుపాడు: మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలను నిలువరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్ అన్నారు. మణిపూర్‌లో జరిగిన ఘటనలను నిరసిస్తూ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో రాచబండ్ల కోయగూడెం, ఎలుకలొద్దు గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ.. మహిళలపై జరిగిన అమానుష ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం బీరేన్ సింగ్, ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏనుగు సీతయ్య, ఈసాల ఎర్రయ్య, బచ్చల నాగేశ్వరరావు, మడి సురేష్, కృష్ణ, కిషోర్, నరసింహారావు, కోటయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: మణిపూర్ ఘటనకు నిరసనగా నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, మణిపూర్ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం(ఎంఎల్) ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో పాత అంజనాపురంలో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, సీపీఐ ప్రజాపంథా మండల కార్యదర్శి బానోత్ ధర్మా, మాణిక్యమ్మ, ఈసం పాపయ్య, ఎట్టి లక్ష్మి, వెంకటరమణ, కోటమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జలగం వర్గీయుల సంబురాలు



బాణసంచా కాలుస్తున్న వెంకట్రావ్ వర్గీయులు

పాల్వంచ: ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హైకోర్టులో వేసిన పిటిషన్‌ను తిరస్కరించిన నేపథ్యంలో గురువారం జలగం వెంకట్రావు వర్గీయులు సంబురాలు చేసుకున్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2018 నుంచి జలగంను ఎమ్మెల్యేగా పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ వనమా తిరిగి పిటిషన్ వేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. జలగం హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, మళ్లీ జలగం వెంకట్రావ్ వల్లే పెండింగ్‌లో ఉన్న పనులు ముందుకు సాగుతాయన్నారు. ఎండీ.మంజూర్, బొల్లం భాస్కర్, సమ్మిడి జనార్ధన్‌రెడ్డి, కాల్వ భాస్కర్, ఇబ్రహీం ఖురేషి, అక్బర్, సాగర్, సమ్మయ్య, సూరిబాబు, హుస్సేన్, సత్యనారాయణ, ఆదిల్, హసీబ్, దయాకర్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కమిషనర్



కుమారస్వామి

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కమిషనర్‌గా ఏఈ పి.కుమారస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఇన్‌చార్జ్ కమిషనర్ అంకుషావలీ నుంచి ఏఈగా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీడీఎంఏ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అంకుషావలీ మేనేజర్‌గా ఇక్కడే బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

పెన్షన్‌దారులు ఆధార్ లింక్ చేయించాలి

టేకులపల్లి: పెన్షన్‌దారులు ఆధార్ లింక్ చేయకపోవడం వల్ల పెన్షన్లు నిలిచిపోతాయని టేకులపల్లి ఎంపీడీఓ కోట వీరబాబు పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ.. మండలంలోని 33 మంది పెన్షదారులు బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, ఎన్‌పీసీఐలో నమోదు లేకపోవడంతో పెన్షన్ పంపిణీకి సమస్య ఏర్పడిందన్నారు. వారు ఆధార్ కార్డుని అప్‌డేట్ చేసి బ్యాంకులో ఇవ్వాలని కోరారు.

ల్యాబ్‌లలో తనిఖీలు

పాల్వంచ: పట్టణంలోని పలు ల్యాబ్‌లలో డిప్యూటీ డీహెంహెచ్‌ఓ డాక్టర్ సుకృత ఆధ్వర్యంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమతుల ప్రకారం ల్యాబ్‌లు నడుస్తున్నాయా అనే విషయాలను పరిశీలించారు. ల్యాబ్ అనుమతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనుమతి లేకుండా థైరో కేర్ నిర్వహిస్తున్న ల్యాబ్‌ను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జూలూరుపాడు: వెంగన్నపాలెం – గుండెపుడి గ్రామాల మధ్య గల ఫంక్షన్ హాల్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. శంభునిగూడేనికి చెందిన తురసం ప్రశాంత్ అతని తల్లి లక్ష్మి, తమ్ముడు గణేష్‌లు బైక్‌పై ఓ శుభాకార్యానికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో కుక్కలు అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ప్రశాంత్‌తోపాటు, తల్లి, తమ్ముడు రోడ్డుపై పడ్డారు. ప్రశాంత్ తలకు గాయాలయ్యాయి. ప్రశాంత్‌ను జూలూరుపాడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

సింగరేణి సేవా సమితి సమీక్ష

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి చేపట్టిన కార్యక్రమాలపై ట్రైనర్లతో సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023–24లో నిర్వహించనున్న సేవా కార్యక్రమాలను నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులను ఎంపిక చేయాలని, ఆసక్తి గల వారినే ఎంపిక చేసుకోవాలని సూచించారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం



సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఇల్లెందురూరల్: ప్రభుత్వం అటవీ భూములకు పోడు పట్టాలిచ్చినా అటవీశాఖ మాత్రం నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని, కాసులిస్తేనే ట్రాక్టర్‌తో దున్నుకునేందుకు, బోర్ వేసుకునేందుకు అనుమతి ఇస్తున్నారని ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యతన గురువారం జరిగింది. కొమరారం రేంజ్ పరిధిలో కిందిస్థాయి అధికారులు కాసులకు అలవాటు పడి రైతులను పీడిస్తున్నారని ఎంపీటీసీ బిచ్చా ఆరోపించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా భూమి కలిగి ఉన్న రైతు అటవీశాఖ అధికారులకు డబ్బులు ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ఈ విషయంలో మండల పరిషత్ తీర్మానం ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. గత మండల పరిషత్ సమావేశంలో చేసిన తీర్మానాలను సంబంధిత అధికారులకు పంపి వివరణ తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారని, ఇలాంటప్పుడు సమావేశాలు నిర్వహించడం ఎందుకని పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించడంలోనూ అధికారులు ఎంపీటీసీలను నిర్లక్ష్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

ప్రజాప్రతినిధుల గైర్హాజరు..

మండల పరిషత్ సమావేశాలకు అధికారులు గైర్హాజరైతే ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులే సమావేశానికి రాలేదు. గురువారం మండల పరిషత్ సమావేశం ప్రారంభంలో ఎంపీపీతో కలిపి కేవలం నలుగురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే ఉన్నారు. సమావేశం ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు ఇద్దరు ఎంపీటీసీలు సంతకం చేసి వెళ్లిపోయారు. దీంతో కోరం పూర్తయినట్లుగా ప్రకటించిన అధికారులు ఆ నలుగురితోనే సమావేశం ప్రారంభించారు. మధ్యలో ఒక ఎంపీటీసీ, ఇద్దరు సర్పంచ్‌లు వచ్చారు. దీంతో ఇద్దరు ఎంపీటీసీలు, గౌరవ సభ్యుల ప్రశ్నలకే సమావేశం పరిమితమైంది.

పట్టు వదలని జీపీ కార్మికులు




చుంచుపల్లి: తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

చుంచుపల్లి: గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా గురువారం 22వ రోజు జోరు వానలో కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలపై స్పందించాలని కోరారు. కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి మురళి, వీరస్వామి, చావా శ్రీనివాస్, దుంపల అమర్‌నాథ్, కిషోర్ కుమార్, బండా రామకృష్ణ, సురేష్ కుమార్, దుర్గాప్రసాద్, వెంకన్న, అనిల్, ఐలయ్య, నాగేశ్వరరావు, మంజుల, సరోజ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల బిక్షాటన

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం 22వ రోజుకు చేరుకుంది. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మికులు గురువారం పట్టణంలో బిక్షాటన చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. పంచాయతీలను సుందరంగా తీర్చిదిద్దిన కార్మికుల సమస్యలను పక్కనపెట్టి వారి ద్వారా వచ్చిన ప్రగతిని ఊరూవాడా ప్రచారం చేసుకుంటూ ప్రభుత్వం లబ్ధి పొందుతోందని విమర్శించారు. కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ నేత చీమల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పులి సైదులు, కామేపల్లి జెడ్పీటీసీ ప్రవీణ్‌నాయక్ ఆర్థిక సహాయం అందజేసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సారంగపాణి, యాకూబ్‌షావలీ, బంధం నాగయ్య, నబీ, మోకాళ్ల రమేష్, జటంగి వెంకన్న, సామేలు, కిరణ్, నర్సింహారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

విద్యుద్దీపాల వెలుగుల్లో చెరువు అలుగు



అలుగు వద్ద మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి, కమిషనర్ కుమారస్వామి, కౌన్సిలర్లు

ఇల్లెందు: పట్టణ ప్రజలకు మంచినీటిని అందించే ఇల్లెందు మంచినీటి చెరువు మత్తడి వద్ద విద్యుత్ దీపాలను అమర్చారు. దీంతో మత్తడిపై రంగురంగుల కాంతులు జిగేల్ మంటున్నాయి. గురువారం రాత్రి మత్తడి పోస్తున్న ప్రదేశంలో స్థానికులు సంబురాలు జరుపుకున్నారు. ఇల్లెందులపాడు మంచినీటి చెరువు మత్తడిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా మున్సిపల్ పాలకవర్గం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రంగు రంగుల విద్యుత్ దీపాలను అలంకరించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరావు, టీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు మెరుగు కార్తీక్ యాదవ్, కౌన్సిలర్‌లు కటకం పద్మావతీ, వార రవి, సయ్యద్ ఆజమ్, కమిషనర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.